ఎవరి ధీమా వారిదే

- మోదీ అంశం బీజేపీకి కలిసి వచ్చేనా?
- స్థానిక ఎమ్మెల్యే బలంపైనే బీఆర్‌ఎస్ ఆశలు
- అధికారంపైనే కాంగ్రెస్ భరోసా


అంబర్‌పేటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు (ఫైల్)

అంబర్‌పేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అంబర్‌పేట నియోజకవర్గంలో మెజార్టీపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ సరళి ఆయా పార్టీల నాయకులను ఆందోళనలో పడేసింది. ఓటరు నాడి అంతుపట్టకపోవడంతో ఎవరికి వారు తమ సంప్రదాయ ఓటింగ్‌పై ఆశలు పెట్టుకున్నారు. పోలైన ఓట్ల జాబితాను చూసుకుని ఎవరికి వారు లెక్కలు వేసుకుంటున్నారు. . నియోజకవర్గ పరిధిలోని ఐదు డివిజన్లలో కాచిగూడ, అంబర్‌పేట, గోల్నాక, నల్లకుంట, బాగ్ అంబర్‌పేటలలో ఉన్న బూత్‌లలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయి అనే విషయంపై చర్చ జరుగుతోంది. బస్తీలు ఎవరివైపు మొగ్గు చూపాయి. కాలనీల్లో ఏ పార్టీకి అధికంగా ఓట్లు పోలాయ్యాయిని తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను, అనుచరులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ ఉండటం, పోలింగ్ జరిగిన తీరును ఎవరు కనిపెట్టలేకపోవడంతో ఆయా పార్టీల నాయకుల్లో పైకి ధీమా కనిపిస్తున్నా లోలోపల ఆందోళన నెలకొన్నట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తల బలం..

నియోజకవర్గంలోని ఆయా డివిజన్‌లలో ఉన్న బస్తీల్లో అంతా తెలంగాణ జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్న వారే ఎక్కువ. . బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలు వీరిని ఆకట్టుకుంటాయని వారు ఓట్లు మొత్తం బీఆర్‌ఎస్‌కే పడ్డాయని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. దీనికి తోడు ప్రతి ఇంటికి వెళ్లి కేసీఆర్ చేసిన చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించామని, ప్రతి కార్యకర్త , నాయకుడు పార్టీ గెలుపు కోసం పని చేశారని, ఎలాగైన బీఆర్‌ఎస్ గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావు గౌడ్ వ్యక్తిత్వం మంచిదని, ఆయనను గెలిపిస్తే అందరికి అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు జోరుగా ప్రచారం చేయడం వంటివి బీఆర్‌ఎస్‌కు అధిక సంఖ్యలో ఓట్లు పడేలా చేసి ఉంటాయని అనుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే మైనార్టీ ఓటర్లు బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు తెలిపారని భావిస్తున్నారు. ఉదయం మందకొడిగా ఉన్న పోలింగ్ సాయంత్రానికల్లా పుంజుకోవడం ఆ ఓటింగ్ అంతా బీఆర్‌ఎస్‌కే లాభమని సంతోషపడుతున్నారు. బీఆర్‌ఎస్‌కు సైలెంటు ఓట్లు పడ్డాయిని, అవే తమ అభ్యర్థిని గెలిపిస్తాయని ధీమాతో ఉన్నారు.

మోదీ ప్రభావంపైనే బీజేపీ..

ఇక బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడం, ప్రధాని మోదీ ప్రభావం ఎక్కువగా ఉండడం, రామ మందిర నిర్మాణం వంటివి ఆయనకు అనుకూల అంశాలుగా చెప్పుకుంటున్నారు. దేశాన్నీ, మోదీని చూసి ఓటు వేయండని, మీ పిల్లల భవిష్యత్తు కోసం ఓటు వేయాడంటూ కిషన్‌రెడ్డి చేసిన ప్రచారం, ప్రసంగం ఓటర్లను ఆలోచింపజేశాయని అనుకుంటున్నారు. వ్యక్తి ముఖ్యం కాదని, మోదీ ముఖ్యమని భావించిన అంబర్‌పేట ఓటర్లు తమ ఓటును బీజేపీకి వేసినట్లు చెప్పుకుంటున్నారు. గత అసెంబ్లీలో బీఆర్‌ఎస్‌కు వేసిన ఓట్లు అన్ని ఇప్పడు బీజేపీ వేశారని ఆయన ధీమాగా ఉన్నారు. బీజేపీకే సైలెంట్లు ఓట్లు పడ్డాయని, పోలింగ్ సరళి కూడా తమకే అనుకులంగా ఉందని గట్టిగా నమ్ముతున్నారు.

అధికారంపైనే ఆశలు..

కాంగ్రెస్ పార్టీ నుంచి పోటి చేసిన అభ్యర్థి దానం నాగేందర్ అంబర్‌పేట్ నియోజకవర్గంలో తనకు కూడా ఓట్లు బాగా పడుతాయని భావిస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేశారని మైనార్టీల ఓట్లు అన్ని తమకే పడ్డాయని భావిస్తున్నారు. ఆ పార్టీ నాయకులు కూడా గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థి జీవితం మళ్లీ రాదు




మాట్లాడుతున్న పరమేశ్వర్

కాచిగూడ: విద్యార్థి జీవితం మళ్లీ రాదని, దానిని పరిపూర్ణంగా ఆస్వాదించాలని జాహ్నవి విద్యాసంస్థల చైర్మన్ పరమేశ్వర్ అన్నారు. జాహ్నవి జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజ్ సికింద్రాబాద్, ప్యారడైజ్ బ్రాంచ్ కళాశాల వార్షికోత్సవం బుధవారం నారాయణగూడ శాలిమార్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతతో అన్ని అంశాలపై పట్టుసాధించాలన్నారు. తమ పిల్లలు విద్యలో పురోగతి సాధించేలా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థినుల ఫ్యాషన్ షో ఆలరించింది. ఆటపాటలతో విద్యార్థినీ విద్యార్థులు సందడి చేశారు. క్రీడా, సాంస్కృతిక రంగాల్లో, విద్యలో రాణించిన విద్యార్థులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ ఎ.లక్ష్మీ, ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

జైపాల్‌రెడ్డి పేరుతో సెమినార్ హాల్ నిర్మించాలి


వృథాగా మారిన ఐసీఎస్ఎసార్ సెమినార్ హాల్

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీలో కేంద్ర మాజీ మంత్రి, పూర్వ విద్యార్థి దివంగత నేత జైపాల్‌రెడ్డి పేరుమీద సెమినార్ హాల్ నిర్మించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. వర్సిటీ లైబ్రరీలోని ఖాళీగా ఉన్న పాత ఐసీఎస్ఎస్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్స్ రీసెర్చ్ సౌద్రన్ రీజినల్ సెంటర్) సెమినార్ హాల్‌కు మరమ్మతులు చేయించి జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలన్నారు. లైబ్రరీ భవనంలోని రెండో అంతస్తులో 1973లో స్థాపించిన ఐసీఎస్ఎస్ఆర్‌ను ఏళ్ల తర్వాత ఓయూ సీఐపీకి (పాత పేరు ఇండో అమెరికన్ స్టడీస్ సెంటర్ భవనం) ఏడాది క్రితం తరలించారు. ఐసీఎస్ఎస్ఆర్ హాల్లో తరుచూ జరిగే సభలు, సమావేశాల కారణంగా లైబ్రరీలో చదివే విద్యార్థులకు అంతరాయం ఏర్పడుతుందనే ఉద్దేశంతో ఓయూ సీఐపీకి తరలించిన విషయం విదితమే. కానీ హాలును మాత్రం వర్సిటీ లైబ్రరీకి ఐసీఎస్ఎస్ఆర్ అధికారులు అప్పంగించగా ఏడాదిగా నిరుపయోగంగా ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ నాయకులు పాల్గొని ప్రసంగించిన ఓయూలోని ఐసీఎస్ఎస్ఆర్ హాల్‌ను వృథా కాకుండ మరమ్మతు చేయించి ఆధునిక హంగులతో పునఃనిర్మిణం చేపట్టి జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్పీఎఫ్ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

చిలకలగూడ: రైల్వే రక్షకదళ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు. చిలకలగూడలోని సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ (ఆర్‌పీఎఫ్‌పీడబ్ల్యూఏ) కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెన్షనర్ అసోషియేషన్ ఆఫ్ రైల్వేస్ (పీఏఆర్) జోనల్ ప్రెసిడెంట్ నారాయణ, కార్యదర్శి విద్యాసాగర్ ముఖ్య అతిథులుగా హాజరై మెడికల్ కార్డు అప్‌గ్రేడేషన్ (యుఎంఐడీ కార్డు), నేషనల్ పెన్షనర్స్ బ్యాంకు అకౌంట్ అంశాలపై అవగాహన కల్పించారు. అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి, జనరల్ సెక్రటరీ జీఏస్ రాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వీ.ముత్యాలు, పీఏఆర్ మల్కాజ్‌గిరి బ్రాంచ్ ప్రతినిధులు గురుమూర్తి, బీకేసింగ్, అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సెలవులను సద్వినియోగం చేసుకోవాలి


చిన్నారులకు శిక్షణ ఇస్తున్న బీబీజీ ప్రతినిధి

బంజారాహిల్స్: జ్ఞానం, నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడానికి వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ (బీబీజీ) సీఎండీ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. సెలవులు అంటే విద్యార్థులు ఎగిరి గంతేస్తారన్నారు. అయితే సెలవులను సద్వినియోగం చేసుకోవడంపై దృష్టిపెట్టాలన్నారు. ఈ విరామ సమయాన్ని సృజనాత్మకంగా మార్చడానికి బీబీజీ నడుంకట్టిందన్నారు. ×బీబీజీ బంగారు తల్లి వేసవి ప్రత్యేక వీడియోలు, కార్యకలాపాలు×ను ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా సమాచారం, విద్యా వీడియోలు, పాడ్‌క్యాస్ట్‌లు, జీకే క్విజ్ పోటీల ద్వారా విద్యార్థులు జ్ఞానం, నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంలో సహాయపడనున్నామని తెలిపారు. విద్యార్థులు నైపుణ్యం, జ్ఞానాన్ని మెరుగుపరచుకోవడానికి వినోదభరిత గేమ్‌లు ఉన్నాయన్నారు. ఈ ప్రోగ్రామ్ కమ్యూనికేషన్ స్కిల్స్, హెల్త్ అండ్ వెల్‌నెస్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సరదా గణితం, వేసవిలో చేయవలసినవి, చేయకూడనివి, వచ్చే విద్యా సంవత్సరానికి సంసిద్ధత తదితర అంశాలు అందించనున్నామన్నారు. ప్రతి వీడియో చివరలో ఒక అసైన్‌మెంట్ ఉంటుందన్నారు. అసైన్‌మెంట్‌ను సమర్పించిన విద్యార్థులకు బీబీజీ బంగారు తల్లి నుంచి ఇన్‌క్రెడిబుల్ స్టూడెంట్‌గా సర్టిఫై చేస్తూ డిజిటల్ సర్టిఫికెట్‌తో రివార్డు ఇవ్వనున్నామని తెలిపారు.

టీవీ సీరియల్ మేకప్‌మెన్ దారుణ హత్య


చెన్నయ్య(ఫైల్)

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని నిమ్స్‌మే మైదానంలో మంగళవారం రాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు... కార్మికనగర్ చిల్లా వద్ద పక్కన ఉన్న నిమ్స్‌మే మైదానం లోపల గోడ వద్ద పడివున్న యువకుడి మృతదేహాన్ని గుర్తించిన నిమ్స్‌మే సెక్యూరిటీ సిబ్బంది బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ వీరశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు టీవీ సీరియల్స్ మేకప్‌మెన్‌గా పని చేసే మహబూబ్‌నగర్ వనపర్తి ప్రాంతానికి చెందిన చుక్కా చెన్నయ్య అలియాస్ తరుణ్‌తేజ్(28)గా గుర్తించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మారణాయుధాలతో దాడి జరుగున్న క్రమంలో మృతుడు గాయాలతో పరిగెత్తి గోడ వద్ద కుప్పకూలి పోయి ఉంటాడని పోలీసులు అంచనాకు వచ్చారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి మృతుడు చెన్నయ్యతో పాటు ఎంత మంది నిమ్స్ మే మైదానం లోని వచ్చారు? ఎలా వచ్చారు? అనే వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. కార్మికనగర్, బస్‌స్టాప్, కార్మికనగర్ శ్రీరాంనగర్ ఉన్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు బోరబండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు ఉచిత హెయిర్ కటింగ్

బంజారాహిల్స్: జీవితాన్ని మాతృభూమి స్వేచ్ఛకై అంకితం చేసిన మహావీరులు భగత్‌సింగ్, రాజ్‌గురులతో పాటు ఉరికంబం ఎక్కిన అమరవీరుడు సుఖ్‌దేవ్ థాపర్ జయంతిని పురస్కరించుకుని సామాజిక సేవకుడు రమేష్ కోడిచెర్ల బైరమానుగూడ డాక్టర్స్‌కాలనీలోని వృద్ధాశ్రమంలోని దివ్యాంగులకు హెయిర్ కటింగ్, షేవింగ్ చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల చాలా ఆశ్రమాలు ఉన్నాయని, ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో తమవంతుగా తోడ్పాటునందించాలని రమేష్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్–11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. శంకర్‌మట్ ఫీడర్ పరిధిలో శంకర్‌మట్, నల్లకుంట, పద్మకాలనీ, మాతృశ్రీ స్కూల్, అమర్ మెటర్నటీ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో 6.30 గంటల నుంచి 7 గంటల వరకు, బసంత్ కాలనీ ఫీడర్ పరిధిలో బసంత్ కాలనీ, లింగంపల్లి, వైశ్య హాస్టల్, జయిన్ మందిర్, వెంకటరమణ థియేటర్, కాచిగూడ ఎక్స్‌రోడ్ తదితర ప్రాంతాల్లో 7 గంటల నుంచి 7.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలి

కాచిగూడ: 2024–25 విద్యా సంవత్సరానికి జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌డేట్ చేయాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారులు ప్రకటించారని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నించినా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ఇంటర్నేట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులను అప్‌డేట్ చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

19న బొడ్రాయి వార్షికోత్సవం

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఈనెల 19న నాభిశిల బొడ్రాయి వార్షికోత్సవం వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బస్తీ పెద్దలంతా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 19న ఉదయం 6 గంటలకు శీతలాదేవి నాభిశిల బొడ్రాయికి జలాభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 7 గంటలకు పంచామృత స్నానాభిషేకం, 8కి చంద్రపటం, 9 గంటలకు అఖండ జ్యోతులు, 10 గంటలకు దిష్టికుంభం, అనంతరం బైండ్ల కళాకారుల ఆధ్వర్యంలో శీతలాదేవి బొడ్రాయి కథ, మధ్యాహ్నం ఒంటి గంట పోతరాజుల విన్యాసాలు, బోనాలు, మంగళహారతులు తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. బీసీల ఓట్లతోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ అమలు చేసి మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులలో అధికంగా ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఉచిత భోజనం





చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని కేంద్ర గ్రంథాలయం ఆవరణలో బుధవారం వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉద్యోగార్థులకు ఉచితంగా భోజనం అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఎవరెస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు క్లబ్ కార్యదర్శి జిల్లా రవీందర్ తెలిపారు. దాదాపు 400 మందికి పైగా ఆహారాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో అరవింద్ కుమార్, కేంద్ర గ్రంథాలయం లైబ్రేరియన్ గాడిచెర్ల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

లిబర్టీ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు చేయూతనివ్వాలని అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా డ్రైవర్ల సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయని స్పష్టం చేశారు. సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఎన్నికల ప్రణాళికలో తాము అధికారంలోకి వస్తే ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి సంవత్సరానికి రూ. 12 వేలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే ప్రతి ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం చేసేపందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెంటనే చర్యలు చేపట్టాలని మల్లేష్ కోరారు. ఉపాధి లేక ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తూ ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జీవన స్థితిగతులు ఎంత మాత్రం మార్పు నోచుకోకుండా దయనీయ జీవితాలు వెల్లదీస్తున్నాయన్నారు. ఆటో డ్రైవర్లకు ఆటోలు కొనుగోలు చేయడానికి సౌకర్యం కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఆటో డ్రైవర్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

లిబర్టీ: మహనీయుల త్యాగాలను మరువద్దని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వర రావు అన్నారు. పోరాటయోధుల ఆత్మబలిదానం వల్లనే దేశానికి స్వాతంత్రం సిద్ధించిందన్నారు. వీరోచితంగా పోరాడిన సుఖ్‌దేవ్ జయంతిని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ పోరాటం చేశారని గుర్తుచేశారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర పోరులో యువతను సమీకరించి ఆ పోరాటంలో సుఖ్‌దేవ్ పాల్గొని యువతను ఉత్తేజ పరిచారని అన్నారు. పోరాటయోధులు మహనీయుల వల్ల వచ్చిన స్వాతంత్రాన్ని దేశ సమగ్రత సమైక్యతను కాపాడుకోవాలని మహనీయుల బాటలో నేటి తరం సాగాలని రాజేశ్వరరావు కోరారు. సమావేశంలో పి.వి.శ్రీనివాస్‌రావు, పి.వి.సంకీర్త పాల్గొన్నారు.

పెంపుడు కుక్క అరిచిందని.. హత్య చేయబోయారంటూ ఫిర్యాదు

వెంగళరావునగర్: పెంపుడు కుక్క అరచిందని తన తమ్ముడితో పాటు మరదలును, కుక్కను హత్య చేయబోయారంటూ వ్యక్తి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రహమత్‌నగర్‌లో నివాసం ఉండే ఎన్.శ్రీనాథ్, అతని భార్య స్వప్నలు ఈ నెల 8వ తేదీనాడు ఉదయం పోస్టల్ బ్యాలెట్ వేయడానికి తన పెంపుడు కుక్కతో పాట ఇంటి నుంచి బయలుదేరాడు. అదే సమయంలో ఇంటి పక్కన ఉన్న వ్యక్తి వారి కుక్క రోడ్డుపై ఉన్నారు. ఆ సమయంలో వీరి కుక్క వారిని చూసి మొరిగింది. దాంతో ధనుంజయ్ అనే వ్యక్తి భార్యభర్తలను దుర్భాషలాడాడు. ఈ విషయంపై నాడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తిరిగి ఈ నెల 14వ తేదీ సాయంత్రం శ్రీనాథ్ కుక్కతో బయటకు రాగా ధనుంజయ్ అనే వ్యక్తితో పాటు నలుగురు వ్యక్తులు వచ్చి శ్రీనాథ్‌ను, అతని భార్య స్వప్నతో పాటుగా మేనల్లుడు, కోడలును, కుక్కను సైతం చంపుతామని బెదిరిస్తూ తీవ్రంగా కర్రలతో, రాడ్లతో కొట్టారు. దాంతో శ్రీనాథ్ అపస్మారక స్థితికి వెళ్లాడు. మిగిలిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాంతో శ్రీనాథ్ సోదరుడు ఎన్.మధు మధురానగర్ పీఎస్‌లో ఎల్.మధుతో పాటు మరో నలుగురిపై హత్య యత్నం కేసు పెట్టాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం


బొమ్మిడి శ్రవణ్ కుమార్

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపొందడం ఖాయమని ఆర్యవైశ్య, బ్రాహ్మణ ఐక్యవేదిక కన్వీనర్ బొమ్మిడి శ్రవణ్‌కుమార్, కన్వీనర్ మురళీ కృష్ణ అన్నారు. బుధవారం కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇండియా కూటమి అత్యధిక సీట్లు సాధించి కేంద్రంలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉందని, ప్రజలందరూ కాంగ్రెస్‌పై ఆదరణ చూపుతున్నారన్నారు. వైశ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాతకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

నంబర్‌ప్లేట్ లేని వాహనచోదకులపై కేసులు


వాహనచోదకులతో సీఐ సీతయ్య, ఎస్ఐ నాగరాజు

చిక్కడపల్లి: నంబర్ ప్లేట్ లేని వాహనచోదకులపై చిక్కడపల్లి పోలీసులు బుధవారం సాయంత్రం కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య మాట్లాడుతూ ప్రజలందరూ వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేటును పెట్టుకోవాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, ఏఎస్ఐ గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహ రాంచందర్‌కు మహాబలి పురస్కారం


స్నేహ రాంచందర్‌కు పురస్కారం అందజేస్తున్న రాజు డాక్టర్ అరివేదకర్ణ

చిక్కడపల్లి: నగరానికి చెందిన ప్రముఖ నృత్యకళాకారిణి స్నేహ రాంచందర్ సాంస్కృతిక, సేవా రంగాలకు చేసి విశేష సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక మహాబలి పురస్కారం లభించింది. ఇండోనేషియాలోని బాలి విశ్వవిద్యాలయంలో సంగమ గ్లోబల్, ఇండియన్‌కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్(ఐసీసీఆర్), బాలి విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన నృత్యోత్సవంలో స్నేహ రాంచందర్ బాలి నగరానికి చెందిన రాజు డాక్టర్ అరివేదకర్ణ చేతుల మీదుగా బుధవారం పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో నిర్వహక సంస్థల ప్రతినిధులు నవీన్ మేఘవిల్, డాక్టర్ ఎస్.పంచనాధమ తదితరులు పాల్గొన్నారు.

కైవల్య యర్రంశెట్టికి ఉగాది పురస్కారం


కథక్ నృత్య ప్రదర్శన ఇస్తున్న కైవల్య యర్రంశెట్టి

చిక్కడపల్లి: ప్రముఖ కథక్ నృత్య కళాకారిణి కైవల్య యర్రంశెట్టికి రసమయి బాలల ఉగాది పురస్కారం దక్కింది. ప్రముఖ కథక్ నృత్యకళాకారుడు పండిట్ ఆంజిబాబు బుధవారం చిక్కడపల్లిలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాట్య కళ గొప్పదని ఎంతో ఆహ్లాదాన్ని అందించేందుకు దోహదపడతుందన్నారు. సాంస్కృతిక కళా రంగాల్లో రాణిస్తున్న కళాకారులకు ప్రంపంచ వ్యాప్తంగా గుర్తింపు , గౌరవం లభిస్తుందన్నారు.

పురస్కార ప్రదానం



చిక్కా దేవదాసును సన్మానిస్తున్న కొలకలూరి ఇనాక్, బాపిరాజు

చిక్కడపల్లి: మానవత్వం, మేధస్సు రెండు కలిసిన చోటే నిజమైన ప్రతిభ ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. కళా నిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో ఆధ్యాత్మిక గురువు, ప్రముఖ సంఘసేవకుడు చిక్కా దేవదాసుకు సహస్ర సేవాధురీణ పురస్కారప్రదానోత్సవం జరిగింది. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వీసీ అచార్య కొలకలూరి ఇనాక్ దేవదాసుకు పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా గాయకుడు బాపిరాజు నిర్వహణలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో ప్రముఖులు సుంకర సత్యనారాయణ, ఆంజనేయులు, చిక్కారామదాసు, లక్ష్మీ బంజారి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్విమ్మింగ్ పూల్ సిద్ధం

ఉస్మానియా యూనివర్సిటీ: ఎట్టకేలకు ఓయూ స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభానికి సిద్ధం చేశారు. మరమ్మతుల కారణంగా ఈ వేసవిలో మూసివేసిన పూల్‌ను విద్యార్థి నాయకుల ఒత్తిడి మేరకు ప్రారంభించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తర్వలో ప్రారంభం కానున్న స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టాలనుకునే వారు దరఖాస్తులు చేసుకోవచ్చని ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజ్‌కుమార్ తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం


భూక్య సురేష్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ (ఇన్ఫర్మేటిక్స్) విభాగం నుంచి భూక్య సురేష్ సురేష్ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.శ్యామ చంద్రప్రసాద్ పర్యవేక్షణలో సెక్యూరిటీ అండ్ ఎనర్జీ బెస్ట్ పాత్ రౌటింగ్ ప్రొటోకాల్ ఇన్ వైర్లెస్ సెన్సార్ నెట్‌వర్క్స్ ఫర్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అప్లికేషన్స్ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు. ఓయూ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేస్తున్న సురేష్ తన పీహెచ్‌డీ డాక్టరేట్‌ను తన తల్లిదండ్రులు దివంగత భూక్య చందర్, సాలవ్వకు అంకితమిస్తున్నట్లు తెలిపారు. కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.రవికుమార్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు సురేష్‌కు అభినందనలు తెలిపారు.